# ఫ్రం ట్రూత్ - టు - ట్రూత్

"ఏం మగవాళ్ళను తన్నాలి" అన్నా కొంచెం కమ్మ్యునల్ ఫీలింగుతో.

"మగవాళ్ళనా మొగుళ్ళనా" అంటూ ఇహ్హిహీ అని నవ్వేశారు. పళ్ళు తోముకోకుండా యింత పెద్ద జోకు నేనే వేశానుగదా ఆడదానిమీద అని మురిసిపోతూ. సెంచరీలబట్టి ఆడదాన్ని కట్టిపడేసిన, విశ్వాసం లేని జాతిని తన్నాల్సిందే అని భృకుటీకరించాను.

"ఐతే ప్రారంభించు-శుభస్య శీఘ్రం!" అని నా పవిట చెంగుతో మొహం తుడుచుకుంటూ "ముందు కాఫీ పోయించు కుందరదనా!" అని పీఠం వేసుకు కూర్చున్నారు. నాకు వొళ్ళు మండిపోయింది. దిసీజ్ నాట్ టర్కిష్ టవల్- దిసీజ్ మై పవిట చెంగు అనివో దులుపు దులిపేశాను.

"మంత్రిగారి చెల్లెలి కళలున్నాయిసుమా నీకు" అని దెబ్బకొట్టారు.

"కార్యేషు మంత్రి-అన్నారుకదా, నేనే మంత్రిని, నాకు మంత్రి కళలుండటవేమిటి నాన్సెన్స్" అన్నా;

"తన్నుల మంత్రం జపించడంవల్ల ఆ మంత్రిగారి కెవరికో మాంచి వడదెబ్బకొట్టి చావు తప్పి కన్ను లొట్టపోయినంత పనయింది" అని కాఫీని వూదుకుంటూ చప్పరించడం ప్రారంభించారు. నీళ్ళు నమలడం అంటారే అలా కాఫీని నముల్తూ తాగుతారు మావారు.

వాకిట కావలి తిమ్మా

ప్రాకటముగ సుకవివరుల పాలిటి కొమ్మా — (ఈ పజ్జాలు పూర్తిగా గుర్తుకువచ్చి ఛావవు. కవియను నామంబు నీటికాకికి లేదే — కవి అంటే జర్నలిస్టుకూడా కావచ్చు) జర్నలిస్టులు మంకీలులాటివాళ్ళు. కపివరులకి, కవివరులకీ అట్టేతేడా లేదు. ఆ మాటకొస్తే అంతా తిమ్మా

రావులే. తిమ్మారావులూ, తతిమ్మారావులూ అంతా ఒకటే— భలే; భలే—
ఎలా కలిసిపోయారో చూశారా!

"బ్రహ్మానందకరీ శివం శుభకరీ శ్రీ రాజరాజేశ్వరీ." తప్పు
కోండి! తప్పుకోండి! దారికడ్డం తప్పుకోండి. ఆ రిక్షా అడ్డం తీసెయ్యండి
శాన్స్క్రిట్ శ్లోకాలొచ్చేస్తున్నాయ్ వచ్చేస్తున్నాయ్, విచ్చేస్తున్నాయ్
జగన్నాథ రథచక్రాల్లా. కొంచెం పైత్యం చేసింది. కళ్ళు తిరుగు
తున్నాయి, వేరుశనక్కాయలు ఎక్కువ తిన్నట్లున్నాను. సోడా పట్రండి
ప్లీజ్. నిమ్మకాయ సోడా అని అరిచాను.

మావారు చాప పరుస్తున్నారు. ఈడ్చుకెళ్ళి పడుకోబెట్టారు. ఇదే
ఆఖరుదశ— నేను టపా కట్టేస్తున్నానని ఎంజాయి చేస్తున్నట్టున్నారు. ఈ
మగాళ్ళ డామ్‌కేర్ మాస్టర్లు, పొడుగ్గా వున్నాయనెవరో వచ్చి పల్సు
చూస్తున్నాడు. కథల్రాసే డాక్టారు కాబోలు. "ఏవిటి తింది ఈ లేడీ"
అని అడగటం నాకు తెలుస్తోంది. స్త్రీల గురించి, పురుషుల గురించి
అంటూ ఏవిటేవిటో చదివిందండీ— అప్పుడ్నుంచీ మగాళ్ళను తన్నాలి
తన్నాలి అని కలవరిస్తోంది. డాక్టారు "షటప్" అని మావారిమీద
కోప్పడ్డారు. వాళ్ళిద్దరూ బెస్ట్ ఫ్రెండ్సలెండి....ఆంటీ పొయిటిక్ ఇంజ
క్షన్స్ వున్నాయని అవి రాసిస్తాను పట్రండి అని చీటీమీద పరపరా ఏదో
బరికేశారు. డాక్టరుగారు వీధిలోకెళ్ళి స్త్రీల గురించి, పురుషుల గురించి
అంటూ యింట్లో మాట్లాడకూడదయ్యా అస్సలే షీ యీజ్ వెరీ వీక్.
పాకెట్‌బుక్సు చదివించండి. రంగనాయకమ్మ పుస్తకాలు విస్సినా శాస్త్రి
కథలూ కొ. కు. వ్యాసాలూ చదవనివ్వకండి. అవి చాలా హైపొటెన్సీ-
రియాక్షనుకి తట్టుకోలేరు. సాఫ్ట్ రైటర్సు యద్దనపూడి, రాధాగోపాళం
కథలూ, ఆ (కో) కౌదేవి నవల్సు తెచ్చియివ్వండి. అబలా సచ్చరిత్ర
రత్నమాల తెచ్చి చదివించకూడదూ? రేడియో వినమనండి. కాదూ
కూడదూ అవ్వే చదువుతాను. అని మారాంచేస్తే కొన్ని పేజీలు చింపి

(పుల్జిగా అన్నం పిడచతీసి రసంపట్టినట్లు) యివ్వండి. యాంటీబొయిటిక్ ఇంజక్షన్స్‌కి గుణం కనపడకపోతే యాంటీ ప్రోగ్రెసివ్ కాప్‌సిల్సు వాడదాం— అని లెక్చరిచ్చి "బీ బ్రేవ్" అని మావార్ని హెచ్చరించి కారులో తుర్రుమన్నారు చికిత్సకుడు మరియు అంగవ్రాతకుడు.

మావారు నా తలాటి దిక్కునే యీజీ చైరు వేసుకుని అనీజీగా కూర్చున్నారు. డాక్టరుగారు వచ్చినపుడు అగ్లీగా పిచ్చెమ్మలా వున్నానేమోనని అనుమానంవేసి అడిగా ఎలా వున్నానని— "నా కళ్ళకా" అన్నారు కొంటెగా. పాతాళ భైరవిలా వున్నావు చేతిలో త్రిశూలం, మెళ్ళోకపాల మాల ఒక్కటే తక్కువ. అద్దం తెచ్చేదా అన్నారు.

అద్దం దగ్గరకు తీసుకెళ్ళి కూర్చోపెట్టండి. "టాయిలెట్" చేసుకుని "డ్రస్" మార్చుకోవాలి అన్నా. పోనీ నేనో రెమిడీ చెప్పనా— అన్నారు. తల వూయించాను. నేను కూడా అగ్లీగా డ్రెస్ చేసుకుని తల దువ్వుకోకుండా బడుద్ధాయిలా నీ పక్క కూర్చుంటాను. అప్పుడు నీకు సరిపోతుందా అన్నారు.

డర్టీ రెమిడీ — మీ మగాళ్ళకు డ్రెస్ సెన్స్ లేదు. మాకది వయసుతోపాటు పెరుగుతో వుంటుంది. నా పెట్టెతెరచి వో రవికా శుభ్రమైన చీరా తెచ్చి నా భుజంమీద వెయ్యండి. వేసి మీరటు తిరిగి గోడకేసి పేపరు చదువుతూ కూర్చోండి. ఎంత ఐదు నిముషాల్లో ఛేంజి చేస్తాను అని చెప్పా. జిడ్డుమొహం వేసుకొని బడుద్ధాయిలా కూర్చుంటాననడానికి నోరెలా వచ్చింది చెప్మా! ఏదీ నోరు తెరవండి అన్నా. నువ్వేమన్నా యశోదవా అంటూ నోరు తెరిచారు. పంటిసందున ఆడాళ్లు కన్పించరే — నోరుముయ్యండి చాలు అన్నా. పంటిసందున ఎక్కడ వుంటారు ఆడాళ్లు కంటిసందున చూడాలి. తప్పక కనిపిస్తారు అన్నారు శ్రీవారు. డోంట్ బి సిల్లీ— ఐ యామ్ సీరియస్, ఆ బనీనూ, లుంగీ మార్చుకుని నీట్‌గా డ్రెస్సయివచ్చికూర్చోరాదూ నా కన్నులపండువుగా? ఆడాళ్ళకున్నంత అలంకరణధ్యాస మగాళ్ళకుండదు. ఆడాళ్ళకు స్వరూప

జ్ఞానమేకాని స్వస్వరూపజ్ఞానం చాలా తక్కువ. ఏవిటి ఎంతమాటన్నారు అని లేచా (కాని మళ్ళీ చాపచుట్టలా వాలిపోయా-- నీరసం) పుట్టిల్లు—అత్తిల్లు (చదువుకుంటే చదువుకున్న స్కూలూ, కాలేజీ) పురుళ్ళోసుకున్న అసుపత్రి- కావలసిన చుట్టాలూ తప్ప ఆడదానికి చుట్టూ వున్న ప్రపంచం చుట్టుకొలత ఎంత? చెప్పదూ అని నా చెవిలో కూశారు. డోంటాక్ రాట్! మీ మగాళ్ళను తన్నాలి అని మళ్ళీ చెబుతున్నా అన్నా. తంతే తందురుగాని కాని మీ ఆడాళ్ళకు సోషల్ లైఫ్ బిగ్ జీరో- అని ఛాలెంజి చేశారు. ఔరా ఔరౌరా ఎంతెంతలేసి మాటలంటున్నారు సిక్‌గా చాపమీద పడివున్నాననిసుంతైనా జాలి లేకుండా అని అప్రతిభురాల్నయాను. టేపు రికార్డు పెట్టినట్లు అడ్డూ ఆపూ లేకుండా వాగేస్తున్నారు మావారు.

నగలూ చీరలూ మొగుడి గొప్పలూ- పిల్లలూ రోగాలూ ఆసుపత్రి తప్పితే సినిమాలు, రేడియో, పత్రికలూ నోవెల్సూ యిదే మీకున్న పరిధి. ఈ కూపంలోపడి కొట్టుకునే మిడిల్ క్లాస్ ఆడదానికి "చదువూ-సంస్కారం" ఒకవేళ వుంటే పూడ్చిపెట్టుకుపోతుంది. కాని మనోవికాసానికి ఏమాత్రం ఛాన్సులేదు. సంసార చక్రంలో బిగుసుకుపోయిన ఆడది ఏ సమస్యనైనా బ్రాడ్‌గా ఆలోచించటానికి (విశాల దృక్పథం అంటే మీ చెల్లెలు విశాల కాదు) వుందా అని నా డవుటు! ఆపండి. మీ టేపు రికార్డుఆపండి సార్. పప్పులో కాలేశారు. మరైతే మా ఆడాళ్ల రచనలు గిలుకుతున్నారు కాదా! నోవెల్సు సీరియల్సు గట్రా రాస్తున్నారు కాదా? థింక్‌చేస్తున్నారు ఇంకు చేస్తున్నారు. వాటీజ్ దిస్ వంకాయపుల్సనుకుంటున్నారా? ఇదంతా ప్రోగ్రెస్ కాదా? ఇందులో మీకేం కనిపిస్తోంది గురూగారూ- పారిపోయే ఆడది కనిపిస్తోందా? ఎక్కడికి ఊహాలోకాల్లోకి. సుందర నందనోద్యానవనాల్లో చంద్రకాంత శిలావేదికపై సొక్కి సోలటానికి, తక్కితారట్లాడటానికి, లాటరీలో లక్ష రూపాయల ప్రయిజు కొట్టెయ్యడానికి పరిగెత్తే ఆడది కనిపిస్తోందా? మీ మగాళ్ళకు అనుబం

ధాలుగా సూట్‌కేసులాగా చేతి కర్రలాగా చెప్పులజోడుగా అణిగిమణిగి పడుండె ఆడదికనిపిస్తోందా? మా ఆడజాతికి ప్రేమింపబడటం ఆరాధింప బడటం అంటె చెడ్డసరదా! మురికి కూపాల్లోంచి ఆకాశహర్మ్యల్లో కెగిరి అక్కడ్నుంచి మళ్ళీ వంటగదిలో అంటతప్పాలా ముందు కూలబడటం రివాజయిపోయింది కోప్పడకండి— మా మెజారిటీ లేడీస్‌కి వయసు పెరుగుతున్నంతగా బుద్ధి వికసించదు.

పాతికేళ్ళ లోపునే ఎదగడం మానేసిన మనఃసులతో మీ మగాళ్ల జీవితం సాగించాలంటె సంసారాలు యమకాంప్లికేటెడ్ అయిపోతాయి. నేన్చెప్తాను వినుకోండి. జ్వరంవచ్చి ప్రేలటం కాదు. ఐ యామ్ ఆల్ రైట్. ఎంత కట్నం తెచ్చినా ఎన్ని రంగారుబంగారు చెంగావిపట్టు రవ సెల్లాలు ధరించినా ఎన్ని తులాల బంగారం మెళ్ళో వ్రేలాడదీసినా ఆడదానికీ, మగాడికీ మెంటల్ లెవెల్స్ సమానస్థాయిలో లేవు.

అంచేత అర్థం చేసుకో నా రాజా అంటే మొగుడు ఏమాత్రం అర్థం చేసుకోగలడు. వైస్ వెర్సా. "పాదాలచెంత చోటు" తప్ప మెంటల్ లెవెల్సు సమానంగాలేని ఆడదానికి మరెక్కడా జాగా ఇల్లే. హృదయంలోనూ నెత్తిమీదా కొంతమంది ఎక్కించుకుంటే ఎక్కించుకోవచ్చు. మై డియర్ సార్! చాలామంది ఆడాళ్ళకు మానసికపరిణామం స్తంభించిపోతుంది. వాళ్లు పరమ డేంజరీమణులు. మా ఆడాళ్ళ సీక్రెట్సు చెప్పకూడనివి చెప్పించేశారు నాచేత. భయపడకండి ఇలావచ్చి నా కాళ్ళ దగ్గర కూర్చోండి. మీ మొహం కనిపిస్తుంది. నా పాదాలచెంత మీకు చోటుంది అని నేనంటానేమోనని జడుస్తున్నట్లున్నారు. ఐ యామ్ నాట్ ఇన్‌టాక్సికేటెడ్ ఐ యామ్ ట్రావెలింగ్ ఫ్రమ్ ట్రూత్ టు ట్రూత్!